
1992 "కన్యాశుల్కం" శతజయంతి ఉత్సవాల సందర్భంగా.




....తమ మానసపుత్రుడు గిరీశం నమస్కార భాణాలు సంధించి వ్రాయు లేఖార్థములు. ఉభయ కుశలోపరి.

మీకేం మహానుభావా! మా వేషగాళ్ళందరినీ చిరంజీవులుగా భూమ్మీద బతికి చావండని వదిలేసి తమరు మాత్రం జై పరమేశ్వరా అంటూ పొరుగు లోకాలకి పెందరాళే వుడాయించేశారు. తమరు తిరిగీ ఈ భూమ్మీదకి దైచేయాల్సిన పనులుండబట్టే ఈ లేఖ.

ముఖ్యమైంది-- ఈ తొంభై రెండు ఆగస్టు మీ/మా/మన కన్యాశుల్కా నాటకానికి హండ్రెడ్త్డేస్....సారీ సినిమా భాష......హండ్రెడియర్స్! జోరుజోరుగా ఊరూరా గుండె గుండెలో మిమ్మల్ని ఊరేగించుకుని ఉత్సవాలు జరుపుకుంటున్నారు. కష్టాలూ బాధలూ భేదాలూ అన్నీ మరచిపోయి హాయిగా తల్పుకు తల్పుకు విరగబడి నవ్వేసుకుంటున్నారు. ఈ టెలుగూస్‌లో ఐకమత్యం లేదన్న గూస్ ఎవడండీ? ముక్కోటి ఆంధ్రులూ ఒక్క కంఠంతో గురజాడ మావాడు అని సగర్వంగా చెప్పుకుంటుంటే!? అన్నట్లు ముక్కోటేం ఖర్మ మనమిప్పుడు ఆరుకోట్ల ఆంధ్రులం.

గుర్తుందా? లోగడ మీరూ నేనూ--'ద ఇలెవెన్ కాజెస్ ఫర్ ద డీ జెనరేషన్ ఆఫిండియా' మీద ఒక్క బిగిని లెక్చరిచ్చేసరికి మన వాళ్ళంతా ఆశ్చర్యపడి లేచి జెనరేషన్ ఆరంభించి ఆరుకోట్లకి పెరిగిపోయారు!

మీరు రంగ నిష్క్రమణం చేశాక చాలా జరిగాయి-ఇండియాకి ఇండిపెండెంసు వచ్చేసింది. తెల్లదొరలు పోయి నల్లదొరలు వచ్చేశారు. ఆఫ్‌కోర్స్! షరా మామూలే. మన జటకా వాడిక్కావల్సిన హెడ్డు కనిస్టేబు బదిలీ మాత్రం ఇంత వరకు జరగలేదు.. గాంధీ, నెహ్రూ, పటేల్, ఆజాద్, పంత్ వంటి పాత్రలన్నీ నిష్క్రమించాయి. కొత్త తరం దేస్సేవకులు విరగబూచారు. మీ పాటని మధురవాణి ముంగురుల్లా కాస్త సవరించి దేశమంటే మంత్రులోయ్ అన్నారు. ఆటల పోటీల్లోకి పాలిటిక్సు దూరినట్టే--పాలిట్రిక్సులోకి ఆటలు జొరబడిపోయాయి. వోట్లాటల్లో ఘనాపాఠీ దేస్సేవకులు రాటు దేలారు......చాలా మంది దేస్సేవకులకు డబ్బు చేసింది. డబ్బు చేసిన వాళ్ళు (విమానాల్లో) ఎగరడవే దప్ప నడవలేరు గదా! అంచేత పల్లెల్లో ప్రజలని కలవడం చూడ్డం.....ఏమిటలా చూస్తారు. దేస్సేవంటే అర్థం మారింది. షష్ఠీ విభక్తిలోని 'కి' అక్షరంతో విగ్రహం చెప్పడం చెల్లదు. ఇప్పుడు ఫాషన్ 'యొక్క' అను విభక్తి. దేశానికి నేనేం చేస్తానని గాదూ; ఈ గడ్డ మీద పుట్టినందుకు దేశం నాకేమిస్తుందీ అన్నదే వైటల్ క్వెశ్చెన్......అలా చూస్తారేం?....

అన్నట్లు కాస్త శాఖా చంక్రమణం....మన మధురవాణి జోరీగలా రొద పెట్టేస్తోంది. మీరుండే ఆ స్వర్గంలో రంభలూ గింభలూ బాగుంఛారా ? సరదాగా వుంఛారా? మీరు మరి భూలోకంలో యాంటీ నాచ్ గదా? అక్కడి వాళ్ళేమో ప్రోనాచ్చిగాళ్ళు గదా?....అక్కడ మరి మీరు నలుగురితో పాటు నారాయణా అంటూ ప్లేటు ఫిరాయించారా? అని అడగమంటోంది....ఆ...బాగా చెప్పారు.

నేనూ అదే అన్నా. ప్లేటు ఫిరాయించడానికి మన గురూజీ పొలిటీషియన్ కారు గదా--కవీ రచయితానూ--అంచేత ఆ క్వెశ్చెన్ లేదూ అని చెప్పాను. అంతేగాదూ; అక్కడ ఆ యింద్రుడూ చంద్రుడూ వాళ్ళూ మామూలు నాచ్‌లు గాదూ--బాగా ముదర కేసులూ-వఠి వ్యభిచారులు గాదూ--జారులూ...అంచాత వాళ్లందర్నీ ఎటాక్ చేసి పరిమార్చడానికని-'దిగజారుడు మెట్లు' అని కొత్త నాటకం రాస్తుంటారు అని బుకాయిస్తున్నాను. రైటేనా?

అబ్బ!....సార్! రైటో తప్పో మాటలతో చెప్పచ్చు గాని అలా ఎర్రగా చూసి కాల్చి పారేస్తే యలా?....చూడండి కమీజు కాలిపోయి చిల్లు పడింది. సర్లెండి చెప్పొచ్చిన పాయింటు కొచ్చేస్తా...

మహాప్రభో! ఈ దాసుడు శాయంగల విన్నపంబులివే. తమరు కన్యాశుల్కం రాసిన దరిమిలాను ఆ సమస్య సిగ్గుపడి చిక్కి సగమై చచ్చిపోయింది. సమస్య చచ్చింది గాని మా నాటకం బతికింది. మేం మిగిలిపోయాం. గానీ--అది ఈసారి వరశుల్కం అనే కొత్త అవతార మెత్తి పెరిగి పేట్రేగిపోతోంది.

మన కన్యాశుల్కం రోజుల్లో ఏదో సాదా సీదాగా ఉరేనుకోడాలూ బావిలో దూకడాలు వగైరా సంసార పక్షపు చావులే ఎరుగుదుం తప్ప--ఈ వరశుల్కం వరస వేరు. కిరసనాయిలూ అగ్గిపెట్టే వగయిరా పరికరాలతో ఆడపిల్లని తగలబెట్టడం రివాజై పోయింది. చూశారా శుల్కం ఏ బాపతైనా శిక్ష మాత్రం ఆడ కూతుళ్ళకే. కాళ్ళకూరి నారాయణరావుగారు వర విక్రయం నాటకం రాసి కోప్పడ్డారు. చాలామంది ఈ సినిమాలు తీసి ఆడించారు. కాని గుణం కనబడలేదు. గుర్రపు డెక్కలా అలా మొండికేసి బతికేస్తోంది.....ఇపుడు దీన్ని మించి పులి మీద పుట్రలా--దీనికి అనుబంధ పరిశ్రమగా--డిగ్రీ శుల్కం అనే కొత్త జబ్బు వచ్చిపడింది.

పల్లెటూళ్ళలో పాలఘాటులో ఆడ పిల్లల్ని కొనుక్కున్నట్టే కాలేజీలో డబ్బిచ్చి డిగ్రీలు కొనుక్కోవచ్చు. మొన్నటి దాకా మేడినమెరికా పీహెచ్చిడీలు అమ్మొచ్చేవి. ఇపుడు దేశవాళీ ఇండస్ట్రీలు పెట్టేశారు. లైసెన్స్ టు కిల్ గల జేమ్సుబాండు లాగానే ఈ లైసెన్సులు కొనుక్కుంటే బ్రిడ్జీలు పడగొట్టవచ్చు. కోడల్ని నిష్పూచీగా చంపవచ్చు ...... అఫలము బొందడధిప అన్నారు పెద్దలు.

అన్నట్టు వీటన్నింటినీ మించిన మోస్ట్ ఇంపార్టెంట్ బర్నింగ్ ప్రాబ్లెంసు ఇంకా చాలా వున్నాయి.

అబ్బెబ్బే....ప్రజగాళ్ళ దరిద్రం, ఆకలి, దాహం, రోగాలూ....అవి కావు. అవి బాగా ఓల్డు ఫాషన్ ప్రాబ్లెంసు'గదా...అవి ఎప్పుడూ ఉన్నాయి; వుంటాయి; వుండాలి కూడా.....నేను చెప్పేవి కొత్తవి. ఫరెగ్జాంపుల్ తిరుపతి విమానాశ్రయంలో వివిఐపిలు అనగా రాజాధిరాజులూ మంత్రాధి మంత్రులూ పెద్ద విమానాల్లో దిగటానికి వీలుగా ఏరోడ్రోముని పెద్దదిగా

కట్టడం.....కొండ మీదకు అబ్బే నడిచే వాళ్ల గొడవ కాదయ్యా స్వామీ--పాపం బస్సుల్లో కారుల్లో కూర్చుని కుదుపుకి అవస్థ పడకుండా జాయ్‌గా ఎగబాకే ట్రాములూ ట్రాలీలూ చెయ్యడం లాటివి. దానిమీద మేధావులు, నాయకులు, పత్రికలు, రేడియోలు అహర్నిశలూ గిలగిల్లాడిపోయి మాట్లాడేస్తున్నారు. తెగ రాసేస్తున్నారు. అలాగే పాకే బెల్టుల మీద భక్తుల్ని దేవుడి ఎదరగా భక్తుల్ని ఊరేగించాలా, దేవుడినే--మన విజినారంలో చిన్న రథంలా--భక్తుల ముందు పెరేడ్ చేయించాలా.....లడ్డూధర పెంచాలా వుంచాలా--యజ్ఞాలు చెయ్యాలా మానాలా--ఇలాంటి భయంకర సమస్యలతో దేశం అతలాకుతలం అయిపోతోంది. ఆ తరవాత--మన రోజుల్లో వర్ధిల్లిన కన్నపు దొంగలు కనుమరుగైపోయి కలం దొంగలు పుట్టుకొచ్చారు. అంటే బ్యాంకులు షేర్లు వగైరాలు--వీళ్లతో చిక్కేమిటంటే ఇట్టె ఇట్టె పట్టుబడిపోతున్నారు.. వీళ్ళందర్నీ కాపాడడం ఎలా.....ప్చ్.....నేనిలా రాస్తే మీకర్థం కాదు.......మీరు కాస్త దిగి రావాలి. మీకు ప్రైవేటు చెప్పి నాలుగైదు నాటకాలు రాయించగల వాడను.

త్వరగా రండి. రాకపోయారో నరసింహారావుగారు నవ్వినంత ఒట్టు.

ఇట్లు

గిరీశం

దేశం బాగుపడి కులాసాగా నవ్వేదాకా ఆయన నవ్వరు. తెలుసుగదా. - గి

